

కడమ్మ స్లూయిజ్ గేట్లకు మరమ్మతులు

పోలవరం:పాత పోలవరం వద్ద ఉన్న కడమ్మ స్లూయిజ్ గేట్లకు అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను ఎఇఇ ఆర్.సునీల్‌బాబు దగ్గరుండి పర్యవేక్షించారు. స్వల్పంగా దెబ్బతిన్న మూడు గేట్లకు వెల్డింగ్ మరమ్మతులు చేయడం, స్లూయిజ్ వద్ద ఉన్న చెత్తను శుభ్రం చెయ్యడం వంటి పనులు చేపట్టి వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవ్వకుండా గేట్లు యథావిధిగా పని చేసేలా చర్యలు తీసుకున్నామని ఆర్.సునీల్ బాబు తెలిపారు. వర్షాకాలంలో కొండవాగులు, కాలువల నుంచి వచ్చే వర్షపు నీరు పొలాలను ముంచెత్తకుండా ఆ నీటిని గోదావరి లోనికి పంపించడం, గోదావరి పొంగి ప్రవహించినప్పుడు ఆ నీరు పొలాలను ముంచెత్తకుండా కడమ్మ స్లూయిజ్ వద్ద ఉన్న గేట్లు టూ ఇన్ వన్ గా పనిచేస్తూ ఎంతగానో దోహదపడతాయి. కాటన్ దొర 1888లో నిర్మించిన స్లూయిజ్ 1986లో అధికంగా వచ్చిన గోదావరి వరదలకు స్లూయిజ్ వద్ద భారీగా గండి పడినప్పటికీ ఈ స్లూయిజ్ చెక్కు చెదరలేదు. ఇది నిర్మించి సుమారు 135 సంవత్సరాలు కావస్తున్నా నేటికి పటిష్టంగా గేట్ల పనితీరు ఆశాజనకంగా ఉంది. అయితే ప్రతీ సంవత్సరం ఈ గేట్లకు అధికారులు మరమ్మతులు చేస్తూ వస్తున్నారు.

నీళ్లలో ముంచారు.. సాయం మరిచారు..!

గతేడాది పోలవరం నిర్వాసిత గ్రామాలను ముంచెత్తిన వరద

దాదాపు ఎనిమిది వేలకుపైగా దెబ్బతిన్న ఇళ్లు

ఇళ్ల నష్టపరిహారం రూ.పది వేలు అందని దుస్థితి

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సగం మందికి మొండిచెయ్యి

నెలలు తరబడి పునరావాస కేంద్రాల్లోనే జీవనం



'నా పేరు ఎమ్‌డి పుల్లు. కుక్కునూరు రామాలయం కాలనీ. మా ఇల్లు గోదావరి వరదలకు కూలిపోయింది. దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం ప్రకటించిన రూ.పది వేల సాయం ఇప్పటికీ అందలేదు. ఇల్లు కట్టుకునే స్తోమత లేదు. నాకు ప్రతినెలా వచ్చే పింఛన్‌పైనే ఆధారపడి బతుకుతున్నాను. ఉన్న ఇల్లు పడిపోవడంతో ఏడాది నుంచి కిచ్చాక పునరావాస కాలనీలోనే ఉంటున్నాను. ప్రభుత్వం వెంటనే స్పందించి వరద సాయం అందించాలి.'



'మాది కుక్కునూరు మండలం బెస్తగూడెం ఎస్‌సి కాలనీ. నా పేరు నడిపింటి రాజమ్మ. గతేడాది వచ్చిన వరదలకు కాలనీ పూర్తిగా మునిగి ఇళ్లు పడిపోయి తీవ్ర నష్టం జరిగింది. మా గ్రామంలోని 263 కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన సాయం అందలేదు. సచివాలయానికి తాళం వేసి అధికారులను దిగ్బంధించి, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా సైతం చేశాం. న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా ఎటువంటి సాయమూ అందలేదు. మళ్లీ గోదావరి వరదలు వచ్చే ప్రమాదం ఉండటంతో ఎక్కడికెళ్లాలో.. ఎలా బతకాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.'



గతేడాది వరదలకు కట్టుబట్టలతో పునరావస కేంద్రాలకు వెళ్తున్న కుక్కునూరు మండలంలో వరదబాధితులు (ఫైల్‌ఫొటో)

పైన పేర్కొన్న ఎమ్‌డి పుల్లు, రాజమ్మనే కాదు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వేల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన సాయం అందని దుస్థితి నెలకొంది. అన్నివిధాలుగా ఆదుకుంటామని నమ్మబలికి ప్రభుత్వం మొండిచెయ్యి చూపడంతో వరద బాధితులైన పోలవరం నిర్వాసితుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గతేడాది జులైలో గోదావరికి పెద్దఎత్తున వరదలు విరుచుకుపడ్డాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 71 అడుగులకుపైగా చేరింది. దీంతో ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మొత్తం 107 గ్రామాలకుగాను వంద గ్రామాల వరకూ నీట మునిగాయి. ఇంటి పైకప్పుల నుంచి వరద నీరు పారింది. దీంతో తాటాకు ఇళ్లన్నీ కుప్పకూలిపోయాయి. అంతా కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు చేరారు. ప్రభుత్వం కుటుంబానికి 20 కిలోల బియ్యం, కిలో ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, నూనె ప్యాకెట్ రూ.రెండు వేల నగదు ఇచ్చి చేతులు దులుపుకుంది. వెంటనే రెండోసారి వరద పోటెత్తడంతో దాదాపు రెండునెలల పాటు నిర్వాసితులంతా పునరావాస కాలనీల్లోనే తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. చుట్టూ వరద, చేయడానికి పని లేక నిర్వాసితులంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల సాయంతో అంతా కడుపు నింపుకున్నారు. వరదలకు ఇళ్లన్నీ కుప్పకూలిపోవడంతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ తడిసి పాడైపోయాయి. ఫ్యాన్లు, పరుపులు, టీవీలు వంటి వస్తువులన్నీ దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న ఇంటికి రూ.పది వేల సాయం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రెండు మండలాల్లో దాదాపు ఎనిమిది వేల వరకూ ఇళ్లు దెబ్బతిన్నట్లు తేల్చారు. నష్టం అంచనాలపైనే అనేక విమర్శలు వెల్లువెత్తాయి.

ఇప్పటికీ అందని ఇంటి సాయం

ప్రభుత్వం ప్రకటించిన ఇంటి సాయం ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ సగం మందికీ అందలేదని బాధితులు చెబుతున్నారు. కుక్కునూరు ఎ-బ్లాక్‌లో 200 కుటుంబాలకు చెందిన ఇళ్లు దెబ్బతినగా 90 శాతం మందికి ప్రభుత్వం ప్రకటించిన సాయం అందలేదని చెబుతున్న పరిస్థితి ఉంది. బెస్తగూడెం కాలనీలో ఇదే పరిస్థితి నెలకొంది. మారేడుబాక, వింజరం, కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, సీతారామనగరం వంటి అనేక గ్రామాల్లో ఇప్పటికీ వరద సాయం అందలేదని బాధితులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికీ చాలామంది ఇల్లు నిర్మించుకునే స్తోమత లేక కిచ్చాక పునరావాస కాలనీలోనే ఉంటున్నారు. ఇప్పటికైనా వరద సాయం అందించాలని బాధితులు కోరుతున్నారు. పునరావాస పరిహారం పూర్తిస్థాయిలో వెంటనే అందించాలని వేడుకుంటున్నారు. మళ్లీ జులై వస్తుండటంతో వరద భయం నిర్వాసితులను వెంటాడుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



అభివాదం చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

విద్యుత్ భారాలు ఉపసంహరించాలి


30న ఏలూరులో ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను విరమించుకోవాలని వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో సిపిఐ ఏలూరు నగర కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై రకరకాల ఛార్జీల పేరిట రూ.50 వేల కోట్ల భారాలను జగన్ ప్రభుత్వం మోపుతుందని విమర్శించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో సైతం స్మార్ట్ మీటర్లను బిగించడం లేదని జగన్మోహన్ రెడ్డి మాత్రం శ్రీకాకుళం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించడం దారుణమన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికార, ప్రతిపక్ష పార్టీలు ఢిల్లీలో సాగిలపడుతూ రాష్ట్రంలో మాత్రం వాదులాడుకుంటున్నాయని విమర్శించారు. సిపిఎం నాయకులు పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ బిల్లులను సిఎం జగన్ ప్రభుత్వం నిస్సిగ్గుగా బలపరుస్తుందని విమర్శించారు. అనంతరం ఎంసిపిఐయు నాయకులు ఎస్.నాగరాజు, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ కొండేటి బేబీ, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కాకి నాని, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పొట్టేలు పెంటయ్య, సిపిఐ ఏలూరు సహాయ కార్యదర్శి వరప్రసాద్, సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన ఏలూరులో విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎం.ఎ.హకీమ్, అజీజ్, బుగ్గల ప్రభాకర్, గేదెల నాగేశ్వరరావు, బికె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రానికి సెట్‌వెల్ సహకారం

ప్రజాశక్తి - ఏలూరు



సర్టిఫికెట్ అందిస్తున్న సెట్‌వెల్ సిఇఒ మెహర్‌రాజ్

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పవర్‌పేట అన్నే భవనంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రానికి సెట్ వెల్ డిపార్ట్‌మెంట్ సహకారం ఉంటుందని సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డి.మెహర్‌రాజ్ అన్నారు. విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 23వ బ్యాచ్‌కు సర్టిఫికెట్ల ప్రధానానికి మెహర్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారద స్వాగతం పలికారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. అనంతరం మెహర్‌రాజ్ మాట్లాడుతూ కంప్యూటర్ విద్య స్వయం ఉపాధికి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసమే కాకుండా ప్రతీ ఉద్యోగానికి ఈ శిక్షణ అవసరంగా కోరుతున్నారన్నారు. విద్యార్థులుగా ఉన్నప్పుడే కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. 2019లో ప్రారంభించిన ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణను రెగ్యులర్‌గా, ఉపాధికి ఉపయోగపడే విధంగా ఎంఎస్ ఆఫీస్, డిటిపి, ఫొటోషాప్, టాలీ కోర్సులు అవసరమైన వారికి నేర్పడం అభినందనీయమన్నారు. ఒక ట్రస్ట్ ఆధ్వర్యంలో రెగ్యులర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రానికి తమవంతుగా రాబోయే బ్యాచ్ నుండి సెట్‌వెల్ గుర్తింపును ఇస్తామని ప్రకటించారు. తద్వారా ఉపాధి అవకాశాలకు శిక్షణ సర్టిఫికెట్లు మరింతగా తోడ్పడుతాయన్నారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 2019లో అప్పటి సెట్‌వెల్ సిఇఒ సుబ్బిరెడ్డి కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభానికి హాజరయ్యారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ప్రస్తుత సిఇఒ ఈ కేంద్రానికి గుర్తింపును ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వి.సురేష్, ఎం.మిల్టన్, ఎం.లక్ష్మి మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ పొందిన వారికి అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న జీవరత్నం

నాగులగూడెం పేదలకు పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గుడిసెలు వేసుకుని 20 ఏళ్లుగా గుడిసెల్లో నివాసం ఉంటున్న నాగులగూడెం పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం నాగులగూడెంలో ఇటీవల కోర్టు ఉత్తర్వులతో ఇళ్లు తొలగించాలని రెవెన్యూ అధికారుల ఒత్తిళ్లకు గురవుతున్న దళిత పేదలతో స్థానిక సిపిఎం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ నాగులగూడెంలో పేదలు గత 20 ఏళ్ల నుంచి సర్వేనెంబర్ 439, 440లో ఉన్న ఎకరం 80 సెంట్లు డొంక పోరంబోకు భూమిలో 32 కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాయని తెలిపారు. తక్షణం ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు పేదల నివాసాలకు మూడు సెంట్లు చొప్పున పట్టాలిచ్చి ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలుగా గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం భూస్వాములతో కుమ్మక్కై పేదల ఇళ్లను కూల్చేందుకు సిద్ధమవ్వడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకున్న భూములను పేదలకు పంచాలని పలుమార్లు దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ పేదలకు న్యాయం చేయని రెవెన్యూ అధికారులు భూస్వాములతో కుమ్మక్కై గ్రామంలో ఉన్న దళితుల ఇళ్లను కూల్చేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి అధికారులకు చిత్త శుద్ధి ఉంటే భూస్వాములు ఆక్రమించుకున్న భూములను సమగ్ర సర్వే జరిపి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ భూమిని కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటిస్తే ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పేదలకు ఇళ్ల స్థలాలు పట్టాలు ఇవ్వకుండా అణచివేస్తున్నారన్నారు. పేదల ఇళ్లను కూల్చేందుకు వచ్చిన జెసిబి యంత్రాలతో చుట్టూ ప్రహరీ, కంచెలను తొలగించిన గాది రామకష్టారెడ్డి, బిల్లా రామిరెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కండెల్లి నాగేశ్వరరావు, మాదాసు కుమారి, అందుగుల ప్రభాకర్‌రావు, గుల్ల చిరంజీవి, కంకిపాటి జయరాజు, చిలక ఇమ్మానియేలు, కె.ఏసు, తానంకి రవి, కె.సీతయ్య, కండెల్లి ఏసు, కూనపాము వెంకన్న, సుబ్బారావు, నాగయ్య, దుర్గారావు పాల్గొన్నారు.

జోరు వానలోనూ కొనసాగిన పాదయాత్ర

పలువురు మద్దతు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, చింతూరు



యాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ, సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ఓ వైపు జోరు వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా పోలవరం నిర్వాసితుల పోరుకేక పాదయాత్ర శనివారం ముందుకు సాగింది. ఎజి కోడేరులో మాజీ ఎంపీ, ఆదివాసీ రాష్ట్రీయ మంచ్ జాతీయ ఛైర్మన్ మిడియం బాబూరావు, నర్సింగపేటలో మాజీ ఎంపీ, సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ పాల్గొన్నారు. వారి ప్రసంగాలు నిర్వాసితుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. నర్సింగపేటలో పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. మాజీ ఎంపిపి రవ్వ రాజయ్య సంఘీభావం తెలిపారు. ఆ ప్రాంత మహిళలు హారతులు పట్టారు. జనసేన నాయకులు మడివి రాజు ప్రత్యక్షంగా పాల్గొని తన మద్దతు తెలియజేశారు. సిపిఎం ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కార్యదర్శి బృజామాజీ, నాయకులు కృష్ణా పాండే, సునిల్ పాణిగ్రహి పాల్గొని పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. అక్కడి నుంచి తిమ్మిరిగూడెం మీదుగా ఎజి కోడేరుకు పాదయాత్ర చేరుకుంది. ఎంపిటిసి జల్లి లావణ్య స్థానిక మహిళలతో కలిసి తిలకం దిద్ది హారతిపట్టారు. అక్కడ భోజనం విరామం అనంతరం పాదయాత్ర ఉలుమూరు చేరగా గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. ప్రజానాట్య మండలి కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అక్కడి నుంచి పాదయాత్ర మల్లెతోట చేరుకుంది. గత వరదలలో పూర్తిగా ధ్వంసమైన ఇళ్లను నాయకులు సందర్శించారు. ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాదయాత్ర విఆర్.పురంలోని చొప్పల్లి మీదుగా రామవరం చేరుకుంది. అక్కడ రాత్రి బస చేశారు. ఈ పాదయాత్రలో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సిపిఎం చింతూరు మండల కార్యదర్శి సురేష్, నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్, మట్ల వాణిశ్రీ, ప్రజాప్రతినిధులు కారం లక్ష్మి, కుంజా రాధ, లావణ్య, నాయకులు పొడియం లక్ష్మణ్, నాగేష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ధనలక్ష్మి కార్యక్రమానికి పలచగా జనం..

సిపిఎం పాదయాత్రతోనే కదిలిన ప్రజానీకం

ఎజి కోడేరులో పోరుకేక పాదయాత్ర సభ నిర్వహించే ప్రాంతం సమీపంలోనే సచివాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎంఎల్ఎ ధనలక్ష్మి హాజరయ్యారు. గ్రామ ప్రజలు అక్కడకు వెళ్లకుండా పోరుకేక పాదయాత్రలో అధికంగా పాల్గొన్నారు. ఇది ఆదివాసీలకు సిపిఎంతో ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పింది. ఈ క్రమంలో భవన ప్రారంభోత్సవం కార్యక్రమానికి ప్రజాదరణ లభించక పోవటంతో ఎంఎల్ఎ కేవలం 15 నిమిషాలలోనే కార్యక్రమం ముగించుకుని వెనుదిరిగారు.



సాగుతున్న పాదయాత్ర



ఆలయంలో జెడ్‌పి చైర్‌పర్సన్ దంపతులు

మద్ది ఆలయంలో జెడ్‌పి చైర్‌పర్సన్ దంపతులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ శనివారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన పద్మశ్రీ దంపతులకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అలాగే ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కె.సరిత విజయభాస్కర్ రెడ్డి, సభ్యులు స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయిబాలపద్మ, జెడ్‌పిటిసి సభ్యులు బాబ్జీ, సర్పంచి గుబ్బల సత్యవేణి, ఎంపిటిసి కొయ్య రమారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

జెఇఇలో భాష్యం విద్యార్థుల ప్రతిభ

ఏలూరులో విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జెఇఇ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన భాష్యం ఐఐటి జెఇఇ అకాడమీ ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అశోక్ నగర్‌లోని భాష్యం క్యాంపస్ వద్ద నుండి ప్రారంభమై ర్యాలీ చాటపర్రు భాష్యం విద్యాసంస్థ వరకు కొనసాగింది. ఈ ర్యాలీని భాష్యం వెస్ట్ జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.శివన్నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో ఓపెన్ క్యాటగిరీలో ఐదో ర్యాంకు సాధించిన ఎ.వెంకట శివరామ్, పదో ర్యాంకు సాధించిన వైవి.మణీంధర రెడ్డికి భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ ఒక్కొక్కరికి రూ.పది లక్షల ఆర్థిక ప్రోత్సాహం అందజేశారు. వివిధ కేటగిరీలలో 50 లోపు 11 ర్యాంకులు, 100 లోపు ర్యాంకులు 16 ర్యాంకులు, 200లోపు 23 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ర్యాలీలో భాష్యం ప్రిన్సిపల్ జి.కోటేశ్వరరావు, జి.రాజశేఖర్, బి.సంధ్యారాణి, ఎస్.కవిత, రాజేశ్వరి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఛార్జీల మోత.. ఫీజుల వాత..!

ఇళ్లల్లో విద్యుత్ ఛార్జీల మోత.. విద్యాసంస్థల్లో ఫీజుల వాతతో జిల్లావాసులు తీవ్ర నిస్తేజం.. ఆవేదనకు గురవుతున్నారు. మరోపక్క కోలుకుంటుందని అంతా అనుకుంటున్న దశలో పరిస్థితి విషమించి యాసిడ్ దాడి బాధితురాలు మృతి చెందడం అందరినీ తీవ్ర ఆవేదనకు గురి చేసింది. ఇక పోలవరం పోరుకేక పేరిట నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన మహా పాదయాత్ర జిల్లాలో వచ్చే సోమవారం ప్రవేశించనున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు సాగించడంతోపాటు ప్రచారం పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు.



ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల మోత తల్లిదండ్రులను తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు గురిచేస్తోంది. దీనికితోడు డీజిల్ ధరలు ఈ కాలంలో పెరగకపోయినప్పటికీ రోడ్లు బాగోలేదని, ఇతర కారణాలు చూపుతూ బస్సు ఫీజులు సైతం 20 శాతం వరకూ పెంచేశారు. ఇక పుస్తకాల పేరిట సాగుతున్న దోపిడీ అంతాఇంతా కాదు. మూడో తరగతి నుంచే కనీసం ఒక్కో విద్యార్థికి పుస్తకాల పేరిట రూ.ఐదు వేలకు తగ్గకుండా వసూలు చేస్తుండటం గమనార్హం. దీనిపై భీమవరం, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆయా విద్యాసంస్థల వద్ద చేపట్టిన ఆందోళనలే నిదర్శనం. మొత్తంగా పరిశీలిస్తే గత సంవత్సరంకన్నా 30 నుంచి 40 శాతం అదనంగా ఫీజులు వసూలు చేస్తుండటం కార్పొరేట్ విద్యాసంస్థలకే చెల్లిందనేది నగ్నసత్యం. అయితే జిల్లా కేంద్రాల్లో సైతం జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించకపోవడం గమనార్హం. రాజకీయ నేతల, ప్రజాప్రతినిధులు, పెద్దల ఒత్తిళ్లతో విద్యాశాఖాధికారులు మౌనం వహిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. విద్యారంగానికి పెద్దపీట వేస్తూ నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టే విషయంలో ఎందుకు ఉదాశీనంగా వ్యవహరిస్తుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది.

విద్యుత్ ఛార్జీల మోతతో జనం తల్లడిల్లుతున్నారు. ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు, వినియోగ ఛార్జీల పేరిట ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు వడ్డన ఏమిటోనని జనం తలలు పట్టుకుంటున్నారు. పథకాల అమలులో కూడా ఇలా పాతవి ఎందుకివ్వరని, ఇచ్చే దగ్గరేమో ముందస్తు తేదీలు, వసూళ్లలో మాత్రం వెనుక సంవత్సరాలు అనే విధానం అమలు చేస్తారా అని అంతా ప్రశ్నిస్తున్నారు. స్మార్ట్ మీటర్ల అంశం కూడా విద్యుత్ వినియోగదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మొత్తంగా విద్యుత్ బిల్లులు ముట్టుకున్నా షాక్ కొట్టే పరిస్థితి ఏర్పడిందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ప్రభుత్వానికి తాము షాక్ ఇవ్వక తప్పదని విద్యుత్ వినియోగదారులు హెచ్చరిస్తున్నారు.

ఏలూరులో యాసిడ్ దాడిలో తీవ్ర గాయాల పాలైన ఫ్రాన్సిక పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయింది. దాడి ఘటనే తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. డిఐజి, ఎస్‌పి ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్టు చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు జిల్లా అధికారులు ప్రయత్నం చేయడంతోపాటు ఆర్థికంగా అండగా నిలిచేందుకు సిద్ధమని ప్రకటించారు. అయినా ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఫ్రాన్సిక మృతితో అనేకాంశాలు తెరపైకి వచ్చాయి. ఘటన జరిగాక జిల్లా అధికారులు స్పందించిన తీరు ప్రశంసనీయమే అయినా ప్రాణం రక్షించలేకపోయామనేది అందరికీ బాధ కల్గించే అంశం. ఇప్పటికైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్షం, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలతో ప్రభుత్వం చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చట్టాలున్నాయని పదేపదే ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే నేతలు, అధికారులు ఆ చట్టాల అమలులో నిష్పక్షపాతంగా, పకడ్బందీగా వ్యవహరిస్తే ఈ ఘటనలు పునరావృతం కావనేది పరిశీలకుల అభిప్రాయం.

ఉమ్మడి జిల్లాలో పోలవరం పోరుకేక మహా పాదయాత్ర ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత ఐదు రోజులుగా పాదయాత్ర అత్యంత ఉత్సాహపూరిత, ఉత్తేజభరిత వాతావరణంలో ముందుకు సాగుతోంది. కారుచీకట్లలో వర్షపు జల్లుల్లో యాత్ర గోదావరి ప్రవాహంలా ముందుకు సాగుతోంది. అధికారమే పరమావధిగా అటు అధికారపక్షం, ఇటు ప్రతిపక్షాల నేతలు చేపడుతున్న యాత్రలకు భిన్నంగా పోలవరం నిర్వాసితులకు అండగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వాన చేపట్టిన పోలవరం పోరుకేక పాదయాత్ర అటు రాజకీయ వర్గాలు, అధికారుల్లో, ఇటు ప్రజల్లో పెద్దఎత్తున చర్చనీయాంశమవుతోంది. ఈ నెల 26న వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట వద్ద జిల్లాలోకి ప్రవేశించే యాత్రకు స్వాగతం పలికేందుకు, జులై ఒకటో తేదీ వరకూ విజయవంతంగా ముందుకు సాగించేందుకు సిపిఎం శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. దీనికి పోలవరం నిర్వాసితులు, గిరిజనులతోపాటు వివిధ సంఘాలు, పార్టీలు, సంస్థలు సైతం మద్దతు పలుకుతూ సహకారం అందించడానికి ముందుకు రావడంతో యాత్రకు ముందే నిర్వాసితులు సాధించిన విజయంగా చెప్పుకోవచ్చు. ఇదే స్ఫూర్తితో సిపిఎం ఆధ్వర్యాన పోలవరం నిర్వాసితుల పోరుకేక పాదయాత్ర తదుపరి ఉద్యమ కార్యాచరణకు నాంది కానుందని చెప్పొచ్చు.

-వియస్‌ఎస్‌వి.ప్రసాద్

గ్రామాలను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - నిడమర్రు

రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న 14.15 గ్రామ ప్రణాళిక సంఘం నిధులను వెంటనే గ్రామ పంచాయతీలకు జమ చేయాలని, గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు డిమాండ్ చేశారు. భువనపల్లిలో కోన శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో రమణరావు మాట్లాడారు. వైసిపి అధికారంలోకొచ్చిన నాలుగేళ్లలో గ్రామ అభివృద్ధి కుంటుపడిందన్నారు. గ్రామాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. గ్రామాల్లో వీధిరోడ్లు, మురుగు వెళ్లే డ్రెయినేజీలు, మంచినీటి కుళాయిల సమస్యలు, చెత్త డంపింగ్ సమస్యలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వం వాడుకున్న గ్రామ ప్రణాళిక నిధులను గ్రామపంచాయతీలకు జమ చేయాలని కోరారు. ప్రజలు ఎన్నుకున్న పంచాయతీ ప్రతినిధులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, కంఠం వరప్రసాద్, లావేటి చంద్రరావు, ప్రగడ మణికంఠ, మిండి బాబూరావు, పిల్లా సూరిబాబు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆదేశాలతో ప్రజా ప్రయోజిత న్యాయసేవపై శాశ్వత లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్‌కుమారి శనివారం ప్రభుత్వ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవాణా, పోస్టల్, ఇన్సూరెన్స్, వైద్య, విద్య, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ ఎన్‌ఆర్‌జిఎస్, హౌసింగ్ రియల్ ఎస్టేట్, పారిశుద్ధ్యం వంటి సేవల్లో లోపం జరిగినప్పుడు ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో అన్ని సేవలు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఎన్‌ఆర్‌జిఎస్, టెలికం, డిఎంహెచ్‌ఒ, ఎలక్ట్రిసిటీ, ఎపిఎస్‌ఆర్‌టిసి, కెనరా బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు పునఃనిర్మించాలని పాదయాత్ర

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీలో పాడైపోయిన రహదారులను పునఃనిర్మించాలని డిమాండ్ చేస్తూ జనసేన నాయకులు, కార్యకర్తలు దొరమామిడి నుంచి బుట్టాయగూడెం వరకు శనివారం పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్రలో బుట్టాయగూడెం, దొరమామిడి గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొని రోడ్లను పునఃనిర్మించాలని నినాదాలు చేశారు. జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు మాట్లాడుతూ అధ్వానంగా ఉన్న రోడ్లు ఎమ్మెల్యేకు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఆ అభివృద్ధి ఎక్కడ కనిపించడంలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కనీసం రోడ్లు కూడా వేయించలేదని విమర్శించారు. ఏజెన్సీ ముఖద్వారమైన జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం రోడ్డు, దొరమామిడి నుంచి బుట్టాయగూడెం రోడ్డు పూర్తిగా పాడైపోయిందన్నారు. నిత్యం ప్రయాణించే స్థానిక ఎంఎల్‌ఎకు ఈ రోడ్లు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. పిఆర్.గూడెం నుంచి కన్నాపురం రోడ్డు, దొరమామిడి నుంచి వందిరిమామిడిగూడెం, వందిరిమామిడి నుంచి పూలికపాడు రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా రోడ్లు పునఃనిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరాటం సాయి, కరాటం ఉమా మహేశ్వరరావు, వేప వాసు, వేలేరుపాడు, టి.నరసాపురం, జీలుగుమిల్లి మండలాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'కి తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - పోలవరం

టిడిపి ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో శనివారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్రకు పోలవరం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ పోలవరం మండల అధ్యక్షుడు బొద్దు కృష్ణ మాట్లాడుతూ మండలంలో టిడిపి బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మంగిన కొండ, పట్టిసీమ సర్పంచి సబ్బారపు శ్రీరామమూర్తి, ఆకుల రాజా, సున్నం సుధీర్‌రావు దొర, పిల్లి నాగరాజు, మజ్జిగ అప్పారావు, గుబ్బా రాంబాబు, ఎస్‌కె.నాగీర్, జల్లేపల్లి సుబ్బారావు, బన్ని పొట్టూరి నారాయణరావు, కొండే యేసు పాల్గొన్నారు.



విద్యా కానుక వివరాలు అప్‌లోడ్ చేస్తున్న సుబ్రహ్మణ్యం

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ప్రజాశక్తి - మండవల్లి

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుకను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని లింగాల స్కూల్ కాంప్లెక్స్ సిఆర్‌పి సుబ్రహ్మణ్యం తెలిపారు. కొర్లపాడులోని ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం పరిశీలించారు. జగనన్న విద్యా కానుక సంబంధించిన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యా కానుకను సక్రమంగా అందించారా లేదా తెలుసుకున్నారు. విద్యార్థులతో బయోమెట్రిక్ తీసుకుని విద్యాకానుక వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు ఆర్థిక ఇబ్బందులు కారణం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న విద్యా కానుకను ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటికే విద్యకు పెద్దపీట వేసి ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని విద్యలో రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు.

గొల్లగూడెం విద్యార్థికి నవోదయలో సీటు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని సర్నాల గొల్లగూడెం ఎంపిపిఎస్ పాఠశాలల్లో చదువుతున్న జంగం శశిహాసిని నవోదయలో సీటు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందుమతి, ఉపాధ్యాయులు జ్ఞాన సుందరం శశిహాసినిని అభినందించారు.

నేరస్తుల్లో సత్ప్రవర్తన రావాలి : సిఐ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దొంగతనం కేసుల్లో పాతనేరస్తులు నేరాలు, దొంగతనాలు వీడి కుటుంబ పోషణకు కష్టపడి పనిచేయాలని సిఐ రాజేష్ సూచించారు. శనివారం స్థానిక సిఐ కార్యాలయం వద్ద పాత కేసులలో నేరస్తులకు సిఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బతకడానికి నేర మార్గాలు కాకుండా మంచి మార్గాలు చాలా ఉన్నాయని తెలిపారు. పరివర్తనతో నేర వృత్తులను వీడిన వారు ఇబ్బందులు పడితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐ సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

పేకాటశిబరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను ఆదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎం.కుటంబరావు తెలిపారు. శనివారం మండలంలోని చిల్లబోయినపల్లిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను ఆదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.33,200 స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను, రాయితీలను గృహ నిర్మాణ సంస్థ లబ్ధిదారులు వినియోగించుకుని సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దీనబాబు కోరారు. మండలంలోని చెట్టున్నపాడులో హౌసింగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి, గృహ నిర్మాణ సంస్థ ఉంగుటూరు డిఇఇ సోమేశ్వరరావు, భీమడోలు ఎఇ సతీష్‌తో కలిసి గ్రామంలో కొనసాగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దీనబాబు మాట్లాడుతూ గ్రామానికి జగనన్న గృహ నిర్మాణ పథకం కింద కేటాయించిన కాలనీకి మంజూరైన 67 ఇళ్లకు 45 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. ఏలూరు అర్బన్ పరిధిలో ఉన్న సదరు గ్రామానికి ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద 28 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 11 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. జగనన్న పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు సంస్థ నిర్మాణ పనులకు అడ్వాన్స్‌గా రూ.20 వేలు, ఐకెపి ద్వారా సదరు కుటుంబానికి రూ.35 వేల రుణం, రాయితీపై సిమెంటు, ఇనుము, శానిటరీ, ఎలక్ట్రికల్ ఇతర గృహ నిర్మాణ సామగ్రి, ఉచితంగా ఇసుక అందించడంతో పాటు రూ.1.83 లక్షలు కేటాయిస్తుందని తెలిపారు. అదే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం లబ్ధిదారులకు రాయితీపై సిమెంటు, ఇసుకతో పాటు నిర్మాణాల కోసం గృహ నిర్మాణ సంస్థ మంజూరు చేసే మొత్తాలను అందిస్తారని తెలిపారు. తాజాగా సదరు ఇళ్లకు సైతం ఐకెపి ద్వారా రుణాలు, గృహ నిర్మాణాలకు అడ్వాన్స్ రూపంలో కొంత మొత్తాన్ని అందిస్తున్నారని తెలిపారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులు గృహ నిర్మాణ సంస్థ అధికారుల సహాయ సహకారాలతో నిర్మాణాలను వేగవంతం పూర్తి చేసుకోవాలని కోరారు. కొందరు లబ్ధిదారులు తాము దూరప్రాంతపు ర్యాంపుల నుంచి ఇసుక తెచ్చుకునేందుకు, మండల స్టాక్ పాయింట్ నుంచి సిమెంటు, ఇనుము ఇతర సామగ్రి తెచ్చుకునేందుకు రవాణా ఖర్చులు అధికమవుతున్నాయని తెలిపారు. దీని దృష్టిలో ఉంచుకొని స్థానికంగా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి వాటిని సరఫరా చేయాలని కోరారు.



మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : జెడ్‌పి చైర్‌పర్సన్



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. కెఆర్.పురం ఐటిడిఎలో జగనన్న సురక్ష కార్యక్రమం సమన్వయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాలుగేళ్ల పాలనలో అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. సచివాలయ, వాలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రతి ఇంటిని చేరుకోగాలిగామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోయారేమోనని, ఎవరికైనా వారి వ్యక్తిగత ధ్రువపత్రాలు అందుకోలేక ఇబ్బందులు పడుతున్నారేమోనని ఇంటింటికి సర్వే చేసి అర్హులందరికీ పథకాలు అందించే బృహత్తర కార్యక్రమమే జగనన్న సురక్ష అని చెప్పారు. ఈ కార్యక్రమం కోసం 2.6 లక్షల మంది వాలంటీర్లు, 1.5 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు రాష్ట్రంలో 1.6 కోట్ల గృహాలను నేరుగా సందర్శించి వారి సమస్యలను గుర్తిస్తారని, వారికి 7.2 లక్షల మంది గృహ సారథులు, 50 వేల మంది పైచిలుకు సచివాలయ కన్వీనర్లు సహకరిస్తారని తెలిపారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాలకు ఇటువంటి కార్యక్రమం వరం వంటిదన్నారు. గిరిజనులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా వారి వద్దకే అధికారులు చేరుకుంటున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క ఇంటికి చేరుకుని వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సత్యనారయణ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీ, ఏడు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, తహశీల్దార్, ఎంపిడిఒ, వ్యవసాయ శాఖ ఎడిలు, ఎలక్ట్రికల్ డిఇ, ఐటిడిఎ పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ లు, డిఇలు, ఇఇలు, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలవరం : ఐటిడిఎ కోట రామచంద్రపురంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం సమన్వయ సమావేశంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను నేరుగా చేరుకుని వారి సమస్యలు తీర్చే ఇటువంటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రభుత్వాధికారులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీ, ఏడు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, తహశీల్దార్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల స్థలాల కోసం అధికారుల కసరత్తులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చెట్లు తొలగించేందుకు కొలతలు వేసిన అటవీశాఖ జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు చేస్తోంది. నారాయణపురంలో 104 మంది అర్హులకు ఇళ్ల స్థలాల కోసం ఉంగుటూరులో రెండేళ్ల క్రితమే సర్వే నెంబరు 860లో 2.70 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. అప్పటికే ఆ భూమిలో యూకలిప్టస్, టేకు, తాటి చెట్లు ఉన్నాయి. వాటిని తొలగించి మెరక పూడ్చి లేఅవుట్‌లో ప్లాట్లు వేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. కాని ఇంతకాలం అందులో ఉన్న వివిధ రకాల చెట్లను తొలగించడమే పెను సవాల్‌గా మారింది. అటవీ శాఖ అధికారులు నిర్ధారించిన రేటుకు చెట్లను నరికి కలప తీసుకెళ్లేందుకు టెండర్లు పిలిచినా పాటదారులెవరూ ముందుకు రాకపోవడంతో చెట్లు తొలగించకపోవడంతో ఇన్నాళ్లు స్థలాల పంపిణీ జరగలేదు. ఈ క్రమంలో వాస్తవంగా జామాయిలు, టేకు, తాటి చెట్లు ఎన్ని ఉన్నాయి... వాటిని నరికితే ఎంతెంత పరిమాణంలో కలప వస్తోంది... దానికి ప్రభుత్వ నిబంధనల మేరకు విలువ ఎంతుందో గుణించేందుకు అటవీశాఖ అధికారులు శనివారం చెట్ల సంఖ్యను, చెట్లు లావు, పొడవు, వ్యాసార్థాన్ని లెక్కించారు. లెక్కింపు నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని బీట్ ఆఫీసర్ నరసింహారావు వెల్లడించారు. చెట్ల కటింగ్ నిమిత్తం అటవీశాఖ అధికారుల నుంచి అనుమతులు రాగానే చెట్లను తొలగించి మెరక చేసి ప్లాట్లు విభజించి ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని తహశీల్దార్ ఎవి.రమణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, నారాయణపురం విఆర్‌ఒలు ఎం.రమేష్, శ్రీనివాస్, విఆర్‌ఎలు సూదివరుపు అప్పారావు, మట్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు బాగుందని జిల్లా పంచాయతీ అధికారి ఎవి.విజయలక్ష్మి అన్నారు. సదరు తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి శనివారం సందర్శించారు. ఘన వ్యర్థాల వినియోగం, ఇతర అంశాలను తనిఖీ చేశారు. కేంద్ర బృందం భీమడోలు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించడం, బాగుందని కితాబు ఇచ్చిన నేపథ్యంలో జిల్లాస్థాయిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అవగాహన, శిక్షణా తరగతుల నిర్వహణకు భీమడోలును ఎంపిక చేసిన నేపథ్యంలో రానున్న కాలంలో మరింత సమర్థవంతంగా శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు పరిశీలించేందుకు భీమడోలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో. గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్సింగ్, వైసిపి ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించటంలో ప్రతిఒక్కరూ కృషి చేయాలని నూజివీడు డివిజన్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.శ్యాంబాబు అన్నారు. ఆగిరిపల్లి ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బాల కార్మిక నిరోధక అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు బాల, బాలికలను పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు. బాలలతో పనులు చేయించటం చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాగమయి, విద్యాశాఖ సిఆర్‌పిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎల్‌ఒ శ్యామ్‌బాబు

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి : ఎంఎల్‌ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుబంధంగా నెల రోజుల పాటు నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతానికి శనివారం ఆళ్ల నాని క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, డివిజన్ ఇన్‌ఛార్జులు, మున్సిపల్ అధికారులతో విస్తృతస్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పథకాలు అందని వారిని గుర్తించి జగనన్న సురక్ష ద్వారా అందేలా చర్యలు తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ బాధ్యతగా తీసుకుని అర్హులకు మేలు జరిగేలా కృషి చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా, అర్హత ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకూ నగర కార్పొరేటర్ పరిధిలోని వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, సమాచారాన్ని సేకరించి పథకాలు అందించేలాగా నివేదికలు తయారు చేస్తారని తెలిపారు. దీంతో పాటు 11 సేవలకు సంబంధించి నసర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

భీమడోలు: వాలంటీర్లు జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేలో భాగంగా నిర్దేశించిన కార్యక్రమాలను పారదర్శకంగా చేపట్టాలని, ప్రతిఒక్కరినీ కలిసి వారు అందించే వివరాలు సేకరించాలని ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి కోరారు. ఆమె శనివారం చెట్టున్నపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాన్ని సందర్శించి వారు నిర్వహించే వివిధ కార్యక్రమాలను నమోదు చేసే తీరును పరిశీలించారు. అనంతరం మల్లవరం గ్రామాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ఉపాధి హామీ పనులను సందర్శించారు. నల్లకోడు మేజర్ మురుగు కాలువ పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ పనుల నిర్వహణకు పేర్లను నమోదు చేసుకున్న 154 మందిలో 122 మంది హాజరయ్యారని, మిగిలినవారు సైతం పనుల్లో భాగస్వామ్యం వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇదే క్రమంలో గ్రామంలో కొనసాగుతున్న హౌసింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వాలంటీర్లతో మాట్లాడుతూ వాలంటీర్లు తమకు కేటాయించిన యాప్‌లో లబ్ధిదారులు చెప్పిన వివరాలను నమోదు చేయాలని, వారు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అవసరమైన సర్టిఫికెట్లు, ఇతరాలను సచివాలయ సిబ్బంది సిద్ధం చేసి వాటి పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసులకు ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - భీమడోలు

విధుల్లో తరచూ ఒత్తిడికి గురయ్యే పోలీసులు, వారికి అండగా నిలిచే కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ఎస్‌పి మేరీ ప్రశాంతి సౌజన్యంతో భీమడోలులో శనివారం ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు సిఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా ఏలూరు రమేష్ హాస్పటల్‌కి చెందిన డాక్టర్ భరత్ ఆధ్వర్యంలో గుండె, షుగరు, బిపి వంటి వ్యాధుల చికిత్సల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో భీమడోలు, ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌లకు చెందిన పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమడోలు, ద్వారకాతిరుమల ఎస్ఐలు చావా సురేష్, సుధీర్, రమేష్ హాస్పటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కలిదిండిలో వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - కలిదిండి

వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ చేపట్టిన డాన్ టు డస్క్ సేవల్లో భాగంగా స్థానిక వాసవీ క్లబ్ వనిత కలిదిండి గోల్డ్ ఆధ్వర్యంలో శనివారం పలుసేవా కార్యక్రమాలు చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయానికి సిమెంట్ బెంచ్, స్థానిక బొడ్డు రవికి ఎరువుల కట్ట, స్ప్రే మిషన్, మిలటరీ ఆర్మీ ఇఎంఇ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసిన చెరుకూరి ఏలియను సన్మానించి బహుమతి అందించారు. పది మంది పేద మహిళలకు చీరలు, దుప్పట్లు, పేద ఆర్యవైశ్య కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మహంకాళి మురళీధర్ ద్వారా అందచేశారు. క్లబ్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ చారుగుండ్ల రమేష్ బాబు, జగదీష్, క్లబ్ సెక్రెటరీ సోలస వసంతలక్ష్మి, కోశాధికారి మానేపల్లి పద్మావతి పాల్గొన్నారు.

'పోలవరానికి' పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి, త్వరితగతిన పూర్తిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఈనెల 26వ తేదీన పోలవరంలో జరిగే బహిరంగ సభ వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి కేంద్రం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనికోసం సిఎం జగన్ కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. 26న సభకు సిపిఐ రాజ్యసభ సభ్యులు బి.సంతోష్‌కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర నాయకులు పి.మధు, టిడిపి శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎపి కాంగ్రెస్ కమిటీ కార్య నిర్వహణ అధ్యక్షులు ఎన్.తులసిరెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు కందుల దుర్గేష్ ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

చింతలపూడి : పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం, పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి ఈ నెల 26న సిపిఐ ఆధ్వర్యంలో పోలవరంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 20 వరకూ పోలవరం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో జీపు జాతా నిర్వహించామన్నారు. అనంతరం సిపిఐ మండల సహాయ కార్యదర్శి తుర్లపాటి బాబు మాట్లాడారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఆగిరిపల్లి: ప్రకృతి సమతుల్యతను రక్షించడానికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎన్‌ఆర్‌ఐ కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ కళాశాలల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్పింగ్ హ్యాండ్, ఐటి స్పార్క్స్ ఆధ్వర్యంలో గ్రీన్‌టెక్ కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.నాగభాస్కరరావు, అకాడమిక్ డైరెక్టర్ జి.సాంబశివరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సురేంద్రబాబు, ఐటి విభాగాధిపతి రాజేంద్ర ప్రసాద్, హెల్పింగ్ హ్యాండ్స్ క్లబ్, ఐటి స్పార్క్స్ కో ఆర్డినేటర్ ఎ.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఏలూరు

నగర ప్రజలు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలం పన్ను వడ్డీ లేకుండా చెల్లించడానికి ఈ నెల జూన్ 30వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నందున పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెలవు దినాల్లో కూడా ఈ కౌంటర్లు పని చేస్తాయని, పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ నగర ప్రజలను కోరారు.

ముగిసిన స్వీయ క్రమశిక్షణ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రమశిక్షణ వారోత్సవాల ముగింపు సభ శనివారం నిర్వహించారు. ఈ సభకు ప్రధానోపాధ్యాయులు జి.ప్రసాదరావు అధ్యక్షత వహించారు. పాఠశాలలో స్వీయ క్రమశిక్షణలో భాగంగా గత వారం రోజులుగా విద్యార్థులకు యోగా, ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు ఉదయం గంటసేపు విద్యార్థులకు యోగా, ధ్యానం సాధన చేయించారు. యోగాసనాలు, ధ్యానంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వారితోపాటు మండల స్థాయి ఆర్థిక అక్షరాస్యత క్విజ్ పోటీల్లో మూడో స్థానం పొందిన పి.జస్వంత్, బి.ప్రసన్నలకు బహుమతులు పంపిణీ చేశారు. స్వీయ క్రమశిక్షణ ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లులు లేకుండా ఎరువులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

బిల్లులు లేకుండా ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్ హెచ్చరించారు. ఆగిరిపల్లి వ్యవసాయాధికారి కార్యాలయంలో డీలర్లతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను ఈ పాస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంలోనే విక్రయించాలని, అధీకృత డీలర్ల నుంచే స్టాక్‌ను పొందాలని, అధిక ధరలకు విక్రయించరాదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రైతులు తాము కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, వ్యవసాయ విస్తరణాధికారి కె.ధనబాబు, డీలర్లు పాల్గొన్నారు.

ఆలయానికి స్టీల్ గేటు వితరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక పాత ఆంధ్రా బ్యాంకు వీధిలో నూతనంగా నిర్మించిన విజయదుర్గ ఆలయానికి దాతలు స్టీల్ గేటు వితరణ చేశారని ఆలయ కమిటీ ఛైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. విజయదుర్గ ఆలయాన్ని సందర్శించిన కంచర్ల బాలకృష్ణ శైలజ దంపతులు రూ.65 వేల విలువైన స్టీల్ గేటును బహూకరించారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ సభ్యులు అమ్మవారి శేష వస్త్రాలతో సన్మానించారు.